క్లుప్తంగా

11న వి.మాడుగులలో జాబ్‌మేళా

అనకాపల్లి: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 11న వి.మాడుగుల ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు సంస్థ జిల్లా అధికారి ఎన్.గోవిందరావు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 18 నుంచి 27 సంవత్సరాల మధ్య వయస్సు గల, పదోతరగతి నుంచి పీజీ వరకూ ఉత్తీర్ణత సాధించిన నిరుద్యోగులు మేళాలో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. జాబ్‌మేళాలో పాల్గొనే వారు ముందుగా naipunyam.ap.gov.in వెబ్ సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 7981102224 అనే నంబరులో సంప్రదించాలని తెలిపారు.

వెంకన్న ఆలయంలో ప్రత్యేక పూజలు

రోలుగుంట : కార్తీక మాసం శనివారం శ్రవణ నక్షత్రం కావడంతో స్థానిక శ్రీ వేంకటేశ్వర ఆలయంలో వైభవంగా స్వామివారికి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులతో పాటు కొవ్వూరు, కొండపాలెం తదితర గ్రామాల నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామి వారిని దర్శించుకొని భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. కార్తీకమాసంలో స్వామివారి జన్మ నక్షత్రం శ్రవణ నక్షత్రం శనివారం రావడంతో ఎంతో గొప్ప పుణ్యదినమని అర్చకులు అన్నారు.

సకాలంలో దరఖాస్తులు పరిష్కరించాలి

మాకవరపాలెం: గ్రామసభల్లో వచ్చిన దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలని ఇన్‌చార్జి తహసీల్దార్ రామారావు ఆదేశించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో శనివారం వీఆర్వోలు, సచివాలయ సర్వే అసిస్టెంట్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల రీ సర్వేలో జరిగిన తప్పులను సరిచేసేందుకు రైతుల నుంచి వచ్చిన దరఖాస్తులను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వాటిపై విచారణ చేయాలన్నారు. కార్యక్రమంలో డీటీలు సోమశేఖర్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

బ్రహ్మాస్త్రం కషాయం తయారీపై అవగాహన



కషాయం తయారు చేస్తున్న దృశ్యం

గొలుగొండ : ప్రకృతి వ్యవసాయంపై గుండిపాల గ్రామంలో రైతులకు అవగాహన కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా ట్రైనర్ వరలక్ష్మి మాట్లాడుతూ బ్రహ్మాస్త్రం తయారీ విధానంపై రైతులకు అవగాహన కల్పించడం జరిగింది. వేప, జామ వంటి ఆకులతో కాషాయం తయారు చేయడం జరుగుతుందని 3 లీటర్ల కషాయం 100 లీటర్లు నీటిలో కలిపి పిచికారి చేయడం వల్ల వరిలో ఉన్న పచ్చపురుగు, దోమ నివారణ జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో రైతులు గంగకుమారి, సత్యవేణి, పార్వతితో పాటు రైతులు పాల్గొన్నారు.

గైరమ్మకు ప్రత్యేక పూజలు



అర్జునగిరి స్కూల్ బిల్డింగ్ వద్ద ఏర్పాటు చేసిన గైరమ్మ

చీడికాడ : అర్జునగిరిలో ఎంపీపీ పాఠశాల వద్ద గల కమ్యూనిటీ భవనంలో ఏర్పాటు చేసిన గైరమ్మ వద్ద ప్రతి రోజు ఉదయం సాయంత్రం వేళల్లో ప్రత్యేక పూజలతో తెల్లవారుజామున, రాత్రి గైరమ్మ మేలుకొలుపు, నిద్రించడం కార్యక్రమాన్ని మహిళలు అతిపవిత్రంగా నిర్వహిస్తున్నారు. దీంతో గ్రామంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ఈ గైరమ్మ విగ్రహానికి గ్రామానికి చెందిన కొప్పక శ్రీను ఆర్థిక సహకారం అందించినట్టు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

వైభవంగా నగర సంకీర్తన

మాకవరపాలెం: వేంకటేశ్వరస్వామి నగర సంకీర్తన వైభవంగా సాగింది. తామరం వేంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శనివారం నగర సంకీర్తన నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండు నుంచి తెల్లవారుజామునే అధిక సంఖ్యలో అయ్యప్ప స్వాములు, భక్తులు శ్రీవారి చిత్ర పటాలను పట్టుకుని భక్తి గీతాలు ఆలపించుకుంటూ నగర సంకీర్తనగా ఆలయానికి చేరుకున్నారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పూజల అనంతరం కమిటీ ఆధ్వర్యంలో పూజలు చేశారు. కార్తీక మాసం కావడంతో అధిక సంఖ్యలో వచ్చిన భక్తుల గోవింద నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
7997958337, 7075709854, 7997958336
సాక్షి

చేదెక్కిన చెరకు సాగు

అందరికీ తీపిని పంచే చెరకు రైతు పరిస్థితి నేడు ఘోరంగా తయారైంది. ఆరుగాలం కష్టపడి చెరకు పండించినా టన్నుకు కనీసం రూ.మూడు వేలు కూడా ధర రావడం లేదు. గిట్టుబాటు ధర లేకపోవడంతో చెరకు సాగు విస్తీర్ణం విస్తీర్ణం గణనీయంగా తగ్గిపోయింది. చోడవరం నియోజకవర్గంలో ఉన్న బుచ్చెయ్యపేట, చోడవరం, రోలుగుంట, రావికమతం మండలాల్లో గతంలో 18 వేల ఎకరాలకు పైగా విస్తీర్ణంలో చెరుకు సాగవగా నేడు 9 వేల ఎకరాల వరకే సాగవుతుంది.



వడ్డాదిలో సాగవుతున్న చెరకు పంట

- గిట్టుబాటు కాని ధర
- 18వేల ఎకరాల నుంచి 9 వేల ఎకరాలకు పడిపోయిన సాగు విస్తీర్ణం
- పట్టించుకోని పాలకులు.. దిక్కుతోచని రైతులు



దిబ్బిడిలో గతంలో చెరకు వేసిన పొలాల్లో సాగవుతున్న సరుగుడు ఇతర పంటలు

బుచ్చెయ్యపేట : గతంలో ఏ గ్రామంలో చూసినా చెరకు పంట విస్తారంగా పండించేవారు. బెల్లం క్రషర్ల ద్వారా బెల్లం ఆటతో పాటు గోవాడ, తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీలకు లక్షలాది టన్నుల చెరకును రైతులు తరలించేవారు. గతంలో గోవాడ సుగర్ ఫ్యాక్టరీలో షేరు ఉన్న చెరకు రైతును లక్షాధికారిగా చూసేవారు. ఎవరైనా రైతు తన ఇంట్లో ఆడపిల్లలకు పెళ్లిచేయడానికి చెరకు షేర్‌ను అమ్మితే రూ.లక్ష నుంచి లక్షన్నర వరకు ధర పలికేది. నేడు చెరకు మద్దతు ధర లేకపోవడంతో అదే చెరకు షేర్‌ను రూ. పది వేలకు కొనేవాడు లేరని పలు గ్రామాల రైతులు వాపోతున్నారు.

బోసిపోయిన సుగర్ ఫ్యాక్టరీలు

ఎకరం విస్తీర్ణంలో చెరకు సాగు చేయడానికి రైతుకు రూ, 35 వేల నుంచి 45 వేలు పెట్టుబడులు అవుతున్నాయి. ఎకరాకు 20 నుండి 25 టన్నుల చెరకు దిగుబడి వస్తోంది. ప్రస్తుతం టన్ను చెరకు 2,700 ధర ఉంది. ఏడాది కాలం కష్టపడినా ఎకరాకు రూ.పది వేలు కూడా ఆదాయం రాకపోవడంతో రైతులు చెరకు సాగును తగ్గించేశారు. ఇప్పటికే తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీ చెరకు సరఫరా లేక మూతపడగా ఆరు లక్షల టన్నుల వరకు చెరకు క్రషింగ్ చేసే గోవాడ సుగర్ ఫ్యాక్టరీ నేడు రెండు లక్షల టన్నులు మాత్రమే క్రషింగ్‌కి పడిపోయింది.

ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి

గతంలో చెరకు రైతులకు గోవాడ సుగర్ ఫ్యాక్టరీ ద్వారా ఉచితంగాను, సబ్సిడీపై చెరకు విత్తనంతో పాటు ఎరువులు, పురుగు మందులను అందించేవారు.

ప్రస్తుతం రైతులు సరఫరా చేసిన చెరకు డబ్బులను సకాలంలో ఇవ్వకపోవడంతో పలు గ్రామాల రైతులు చెరకు సాగును తగ్గించేసి ప్రత్యామ్నాయంగా సరుగుడు ఇతర అపరాలు, కూరగాయల పంటలు సాగు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. ఇప్పటికైనా చెరకు పంటకు మద్దతు ధర టన్నుకు రూ.4 వేలు వరకు అందించి సబ్సిడీపై విత్తనం, ఎరువులు అందించి ఆదుకోవాలని చెరకు రైతులు కోరుతున్నారు.

మద్దతు ధర పెరగాలి



గతంలో మేం గోవాడ సుగర్ ఫ్యాక్టరీకి 130 నుంచి 150 టన్నుల వరకు చెరకు సరఫరా చేసేవాడిని. నేడు కూలీల ఖర్చులు, ఎరువులు, వ్యవసాయ పెట్టుబడుల ఖర్చులు పెరిగిన చెరకు మద్దతు ధర మాత్రం పెంచడం లేదు. దీంతో చెరకు సాగు వల్ల లాభాలు రాకపోగా నష్టాలు రావడంతో కేవలం 20 టన్నులు వరకు మాత్రమే సాగు చేసి సరఫరా చేస్తున్నాను. చెరకు పంటకు మద్దతు ధర అందించాలి.

– గోపిశెట్టి శ్రీను, కేపీ అగ్రహారం రైతు

ప్రభుత్వ నిర్లక్ష్యం



బజారులో కేజీ బెల్లం, పంచదార రూ.45 నుంచి రూ.60 వరకు అమ్ముతున్నారు. రైతుకి మాత్రం టన్నుకి రూ. 2,700 అందిస్తున్నారు. ఎకరాకి పది వేలు కూడా ఆదాయం రాకపోతే రైతులు ఎలా బతకాలి. గతంలో బుచ్చెయ్యపేట కాటా నుంచి 15 వేల టన్నుల చెరకు సరఫరా అయ్యేది. నేడు ఐదు వేల టన్నులు అయింది. ప్రభుత్వం చోద్యం చూస్తోంది.

– జిత్రిపోతుల రామారావు, రైతు బుచ్చెయ్యపేట కాటా

సాగు తగ్గింది



చెరకు పంట సాగు విస్తీర్ణం ప్రతి ఏటా తగ్గిపోతుంది. గతంలో వరి, చెరకు సాగు విస్తీర్ణాలు సమానంగా ఉండి పోటీ పడేవి. ఇపుడు చెరకు పంటకు గిట్టుబాటు ధర లేదని చాలా మంది రైతులు సాగు చేయడానికి ముందుకు రావడం లేదు. సాగు విస్తీర్ణం పెంపుపై, మద్దతు ధర అందించడంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాను. రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకునేలా చూస్తాం.

– భాస్కరరావు, మండల వ్యవసాయాధికారి, బుచ్చెయ్యపేట

క్యాన్సర్ వ్యాధి గుర్తింపుపై శిక్షణ



శిక్షణలో మాట్లాడుతున్న వైద్యాధికారి శ్రీవిద్య

మాకవరపాలెం : క్యాన్సర్ వ్యాధి గుర్తింపుపై వైద్య సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఇంటింటికీ క్యాన్సర్ పరీక్షల నేపథ్యంలో శనివారం స్థానిక పీహెచ్‌సీలో ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి శ్రీవిద్య మాట్లాడుతూ అవగాహనతోనే క్యాన్సర్‌ను నివారించవచ్చన్నారు. క్యాన్సర్ లక్షణాలు, గుర్తింపు, వ్యాధి నివారణపై శిక్షణ ఇచ్చారు. కొద్ది రోజుల్లో క్యాన్సర్ వ్యాధి నివారణకు ఇంటింటి సర్వే చేయాల్సి ఉందన్నారు.

నేడు హైందవ శంఖారావం సన్నాహక సమావేశం

మాడుగుల రూరల్ : వచ్చే ఏడాది జనవరి 5 వ తేదీన విజయవాడలో జరిగే హైందవ శంఖారావం సన్నాహక సమావేశం కె.జె.పురం జంక్షన్‌లో ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు జరగుతుందని, హైందవ శంఖారావం మండల ఖండ కమిటీ కన్వీనర్ రాపేట రామకొండలరావు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఓలేటి సత్యనారాయణ హాజరవుతారని, వీహెచ్‌పీ, ఆర్ఎస్ఎస్, ఎస్ఎస్ఎఫ్, భజన బృందాలు, ఇతర హిందూ సంస్థల సభ్యులు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు.

18న కార్తీక దీపోత్సవం

మాడుగుల : స్థానిక పార్థసారథి ఆలయంపై ఈ నెల 8వ తేదీన కార్తీక దీపోత్సవం జరగనుందని, ఆలయ ప్రధాన అర్చకుడు పార్థసారథాచార్యులు అన్నారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

నిరుపేదలకు అండగా లోక్ అదాలత్



సదస్సులో మాట్లాడుతున్న న్యాయవాది ప్రసాదరావు

మాడుగుల : నిరుపేదలకు న్యాయ పరంగా ఉచితంగా సేవలందించడానికి లోక్ అదాలత్ చట్టం ఉందని, స్థానిక సీనియర్ న్యాయవాది శ్రీనాదు ప్రసాదరావు గుర్తు చేశారు. మండలంలో చింతలూరు గదబూరు గ్రామంలో జాతీయ న్యాయ సేవా దినోత్సవం సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు ఆర్థికంగా సామాజికంగా ఇబ్బంది పడుతున్న ప్రజలకు న్యాయసేవలందించడానికి 1987లో చట్టం చేశారని వివరించారు. దీంతో లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేసుకోవడానికి అవకాశం కలిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ ప్రసాద్, ఎంపీటీసీ బి.శ్రీను, నాయకులు కళ్యాణరాజు, మెలిపాక స్వామి, కాళింగ రామరాజు పాల్గొన్నారు.

గోపాష్టమి పూజలు

మాడుగుల రూరల్ : గోమాతను ప్రతి రోజు పూజించాలని విశ్వహిందూ పరిషత్ మండల అధ్యక్షుడు రాపేట రామకొండలరావు పేర్కొన్నారు. గోపాష్టమి సందర్భంగా విశ్వహిందూ పరిషత్ పిలుపు మేరకు కె.జె.పురం జంక్షన్‌లో గల కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం గోమాతకు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గోమాతకు పసుపు, కుంకుమ రాసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలో అన్ని గ్రామాల్లో గోమాతకు పూజలు ఈ నెల 15 వరకు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల విశ్వహిందూ పరిషత్ కార్యదర్శి పెచ్చేటి కొండలరావు, ఉపాధ్యక్షుడు కరణం దేముళ్లు, సత్సంగ్ ప్రముఖ్ అప్పాన ప్రసాద్, సభ్యులు అడ్డూరి సత్యవతి, శాంతో పద్మ, కరణం వెంకటలక్ష్మి, కందికొండ కొండబాబు పాల్గొన్నారు.



కేజేపురం జంక్షన్ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోమాతకు పూజలు

ఘనంగా గౌరీ పరమేశ్వరుల అనుపోత్సవం

కె.కోటపాడు : ఆనందపురం గ్రామంలో గౌరీపరమేశ్వరుల విగ్రహ అనుపు మహోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక కర్రి, గురు కుటుంబీకులు, గ్రామస్తుల ఆధ్వర్యంలో గౌరీపరమేశ్వరులకు పూజలు నిర్వహించి మధ్యాహ్నం మండపం వద్ద అన్నసమారాధన జరిపారు. రాత్రికి గౌరీపరమేశ్వరుల విగ్రహాలను గ్రామంలో ఊరేగింపు జరిపి అనుపు కార్యక్రమాన్ని పూర్తి చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వంటాకు అప్పాజి, మాజీ సర్పంచ్ బంగారునాయుడు, దేముడుబాబు, దార్ల శ్రీనివాసరావు, బోజంకి తులసి, సూర్యనారాయణ, దేముళ్ల పాల్గొన్నారు.



ఆనందపురంలో గౌరీపరమేశ్వరులకు పూజలు

ప్రజా సమస్యలపై ప్రజాపోరు

సూర్రెడ్డిపాలెంలో గోడపత్రికల ఆవిష్కరణ



గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న నాయినిబాబు

కె.కోటపాడు : ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఎం ఆధ్వర్యంలో ఈ నెల 8 నుంచి 15 తేదీ వరకూ ప్రజాపోరు కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు ఆ పార్టీ నాయకుడు గండి నాయినిబాబు అన్నారు. సూర్రెడ్డిపాలెం గ్రామంలో శుక్రవారం ప్రజా పోరు గోడపత్రికలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించడంతో పాటు ట్రూ అప్ ఛార్జీల పేరుతో పెంచిన విద్యుత్ చార్జీలను ప్రభుత్వం తగ్గించాలని డిమాండ్ చేశారు. మహిళలు, పిల్లలు, దళితులపై దాడులకు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని, విశాఖ ఉక్కు ప్రవేటీకరణను ఆపాలని అన్నారు. ప్రభుత్వం పట్టించుకోక పోవడం వల్ల కలుగుతున్న నష్టాలను ప్రజా పోరు కార్యక్రమంలో భాగంగా ప్రజలకు వివరిస్తామన్నారు. కార్యక్రమంలో వనుం సూర్యనారాయణ, బొడ్డు ఆదినారాయణ, సముద్రం, అర్జున, అచ్చింనాయుడు, యర్రా దేముడు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల నమోదు



కె.కోటపాడులో దరఖాస్తుల స్వీకరణ



తెనుగుపూడిలో శిబిరాన్ని తనిఖీ చేస్తున్న సర్వేయర్

కె.కోటపాడు : 2025 జనవరి 1 నాటికి 18 ఏళ్లు పూర్తయ్యే యువతీ, యువకులు ఓటు హక్కు పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని కె.కోటపాడు బీఎల్‌వో జగదీష్ అన్నారు. కె.కోటపాడు హైస్కూల్‌లో శనివారం నిర్వహించిన ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమం సందర్భంగా ఓటుహక్కు నమోదుకు వచ్చిన ఫారం-6 దరఖాస్తులను ఆయన స్వీకరించారు. ఓటరు నమోదు కార్యక్రమం ఆదివారం కూడా నిర్వహించనున్నట్టు తహసీల్దార్ భాగ్యవతి తెలిపారు.

ఓటు హక్కు నమోదు చేసుకోండి

దేవరాపల్లి : పద్దెనిమిదేళ్ల వయసు నిండిన యువతీ, యువకులు ఓటు హక్కు నమోదు చేసుకోవాలని దేవరాపల్లి మండల సర్వేయర్ జి. గోవిందరాజులు సూచించారు. మండలంలోని పోలింగ్‌కేంద్రాల వద్ద ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలను శనివారం నిర్వహించారు. ఈ కేంద్రాలను మండల సర్వేయర్ జి. గోవిందరాజు తనిఖీ చేశారు. కొత్తగా ఓటు కోసం ఫారం-6 దరఖాస్తుతో పాటు వయసు ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు సమర్పించాలన్నారు. ఓటరు జాబితాలో పేర్లు తప్పు ఒప్పులు ఉంటే సరిచేసుకోవచ్చునన్నారు.

రెండు రోజుల పాటు ఓటరు జాబితా సవరణ



వీఆర్వో రాజులనాయుడికి సూచనలు చేస్తున్న తహసీల్దార్ ఎస్.నాగమ్మ

రోలుగుంట : రెవెన్యూశాఖ చేపట్టిన రెండు రోజుల ఓటరు జాబితా సవరణ ప్రత్యేక ప్రచార కార్యక్రమం శనివారం ప్రారంభమైంది. మండలంలో గల 43 పోలింగ్ కేంద్రాల వద్ద తహసీల్దార్ ఎస్.నాగమ్మ పర్యవేక్షణలో బీఎల్వోలు వారి విధులు నిర్వహించారు. బీఎల్వోలకు విధులకు సంబంధించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమం ఆదివారం కూడా కొనసాగుతుందని ఓటర్లు తమ చిరునామాలు, పేర్లు, తదితర వివరాల సవరణను పోలింగ్‌కేంద్రాల వద్ద సవరణకు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ సూచించారు.

ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి


నర్సీపట్నం : సెలవు దినాల్లో పాఠశాలలను నడుపుతూ విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్న ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ డివిజన్ ప్రెసిడెంట్ గౌతమ్ డిమాండ్ చేశారు. రెండో శనివారం సెలవు దినమైనప్పటికీ అమరావతి, నారాయణ, చైతన్య ప్రైవేట్ విద్యాసంస్థలు క్లాస్‌లు నిర్వహించి విద్యార్థులను ఇబ్బందులు పెడుతున్నారన్నారు. ప్రభుత్వ నిబంధనలను ల్లంఘిస్తున్న పాఠశాలలపై విద్యాశాఖాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్స్ నూతన కార్యవర్గం



నర్సీపట్నం: నర్సీపట్నం జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. ప్రెసిడెంట్‌గా ఎం.సింహాచలం, వైస్‌ప్రెసిడెంట్‌గా కె.లక్ష్మణ్ కిరణ్, జనరల్ సెక్రటరీగా ఆర్.లక్ష్మణ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎన్.సన్యాసిరావు, జాయింట్ సెక్రటరీ కె.సంధ్యారాణి, ట్రెజరర్ డి.గోపి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సర్కిల్ రిప్రజెంటేటివ్ ఆర్.వినోద్ కుమార్, జోనల్ సెక్రటరీ కె.శివ ప్రసాద్ అధ్యక్షతన నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. అసోసియేషన్‌ను బలోపేతం చేయడంతో పాటు ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని నూతన కార్యవర్గ సభ్యులు పేర్కొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ



గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందజేస్తున్న కౌన్సిలర్ పద్మావతి, సత్యసాయి భక్తులు

నర్సీపట్నం: భగవాన్ శ్రీసత్యసాయి బాబా భక్తులు ఏరియా ఆస్పత్రిలో గర్భిణులకు కౌన్సిలర్ సిహెచ్. పద్మావతి చేతుల మీదగా పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. సత్యసాయి బాబా 99వ జన్మదినాన్ని పురస్కరించుకుని పౌష్టికాహారాన్ని అందజేశారు. సత్యసాయిబాబా భక్తులు చేస్తున్న సామాజిక సేవలను కౌన్సిలర్ పద్మావతి కొనియాడారు. సత్యసాయి సేవా సమితి ఆధ్యాత్మికతతో పాటు సేవా కార్యక్రమాలు చేపట్టడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరిండెంటెంట్ సత్యనారాయణ, డాక్టర్ లక్ష్మణ్‌రావు, రామచంద్రరావు మాస్టారు, కన్వీనర్ రామకృష్ణ, జిల్లా ఆధ్యాత్మిక సమన్వయ కర్త సాయిలక్ష్మి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బండారుకు వెలుగు వీఓఏల వినతి



ఎమ్మెల్యే బండారుకు వినతిపత్రం అందిస్తున్న వీవోఏలు

మాడుగుల రూరల్ : వెలుగు సంస్థలో పనిచేస్తున్న వీఓఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ జిల్లా వీఓఏల సంఘ ఉపాధ్యక్షుడు సుంకర శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మాడుగుల, చీడికాడ, దేవరాపల్లి, కె. కోటపాడు, మండలాలకు చెందిన వీఓఏలు ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తికి వినతి పత్రం అందజేశారు. మూడేళ్ల కాల పరిమితి సర్క్యులర్ రద్దు చేయాలని, ఐదు మాసాల వేతన బకాయిలు చెల్లించాలని, అక్రమ తొలగింపులు, వేధింపులు ఆపాలని వినతిపత్రంలో కోరారు. మండల యూనియన్ గౌరవ అధ్యక్షుడు రావాడ కొండబాబు, అధ్యక్షులు బత్తుల గంగాభవాని, మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటరు నమోదు



విజయరామరాజుపేటలో పోలింగ్ అధికారులతో మాట్లాడుతున్న గౌతమికుమారి

బుచ్చెయ్యపేట : అన్ని గ్రామాల్లో 18 ఏళ్లు నిండిన యువతీయువకులకు కొత్తగా ఓటు హక్కు కల్పించాలని బీఎల్ఓలకు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి గౌతమికుమారి ఆదేశించారు. రెండు రోజుల పాటు జరిగే ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమంలో భాగంగా ఆమె శనివారం విజయరామరాజుపేట, వడ్డాదిలో పోలింగ్ కేంద్రాల్ని పరిశీలించారు. 2025 జనవరికి 18 ఏళ్లు వయస్సు నిండిన వారి నుండి ఆధార్ కార్డు, ఫొటో, పదో తరగతి మార్కుల జాబితా, ఫోన్ నంబర్ సేకరించి కొత్త ఓటర్లుగా చేర్పించాలన్నారు. శని, ఆదివారం రెండు రోజులు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆయా గ్రామాల బీఎల్ఓలు పోలింగ్ కేంద్రాల్లో ఉండి కొత్త ఓటర్లను చేర్పించాలన్నారు. ఓటర్ల నమోదులో అలసత్వం వహించే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు.

104 సిబ్బంది జీతాల చెల్లించాలి



మాడుగుల తహసీల్దారు రమాదేవికి వినతిపత్రం అందజేస్తున్న 104 సిబ్బంది

మాడుగుల రూరల్ : అరబిందో యాజమాన్యం వసూలు చేసిన పీఎఫ్ నగదు తిరిగి చెల్లించాలని, మూడు మాసాల నుంచి తమకు అందించాల్సిన జీతాలు వెంటనే ఇవ్వాలని కోరుతూ 104 ఉద్యోగులు స్థానిక తహసీల్దారు కె.రమాదేవికి శనివారం వినతిపత్రం అందజేశారు. 104 సేవలను ప్రభుత్వమే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా నిర్వహించాలని, 2020 తర్వాత విధుల్లో చేరిన డ్రైవరు, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు జీవో నంబరు 7 అనుసరించి జీతాలు అందించాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో జిల్లా 104 సిబ్బంది యూనియన్ ఉపాధ్యక్షులు శీరంరెడ్డి భార్గవ్, సింహాచలంనాయుడు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ అల్లు మనీసా, డి.విజయకుమార్ పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో దివ్య అఖండ నామ సంకీర్తన



ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తున్న ప్రతినిధులు

దేవరాపల్లి: మండలంలోని ఎ.కొత్తపల్లి గ్రామంలో సత్యసాయి దివ్య అఖండ నామ సంకీర్తన కార్యక్రమం శనివారం ఘనంగా ప్రారంభమైంది. సత్యసాయి బాబా చిత్రపటం వద్ద పూజలు నిర్వహించి అఖండ నామ సంకీర్తన కార్యక్రమాన్ని ప్రారంభించారు. శనివారం సాయంత్రం నుంచి ప్రారంభమైన అఖండ నామ సంకీర్తన ఆదివారం సాయంత్రం ఆరు గంటల వరకు కొనసాగుతుందని సత్యసాయి సేవా సంస్థలు, భజన మండలి ప్రతినిధులు తెలిపారు. విశ్వవ్యాప్తంగా 140 దేశాల్లో ఈ దివ్య అఖండ నామ సంకీర్తన కార్యక్రమం ఏకధాటిగా 24 గంటల పాటు జరుగుతుందన్నారు. సత్యసాయి సంస్థల ప్రతినిధులు కశిరెడ్డి అప్పలనాయుడు, ఆదిరెడ్డి చినకన్నబాబు, రవికుమార్ ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు.

బాలిక వైద్యానికి ఆర్థిక సహాయం



స్కూల్ టీచర్స్‌కు ఆర్థిక సహాయం అందజేస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు

నర్సీపట్నం : విద్యార్థిని సీహెచ్.సాహిత్య ఆపరేషన్‌కు హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు రూ.26 వేలు ఆర్థిక సహాయంగా శనివారం స్కూల్ టీచర్స్‌కు అందజేశారు. అమరావతి స్కూల్‌లో సాహిత్య యూకేజీ చదువుతుంది. సెలవు రోజున మున్సిపల్ స్టేడియంలో తోటి పిల్లలతో ఆడుతూ పడిపోవడంతో గాయాలయ్యాయి. ఆమె తల్లిదండ్రులు విశాఖ కిమ్స్ ఐకాన్ హాస్పటల్‌లో సాహిత్యను చూపించారు. కిడ్నీలో రక్తం గడ్డ కట్టడంతో యూరిన్ నుంచి బ్లడ్ వస్తుందని, దీనికి సర్జరీ చేయాలంటే రూ.5 లక్షలు ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు. దీంతో పాపను హాస్పటల్‌లో అడ్మిట్ చేశారు. ఈ విషయాన్ని పాఠశాల టీచర్స్ ద్రాక్షాయిణి, పుష్పలత హెల్పింగ్ హ్యాండ్స్ వారి దృష్టికి తీసుకువెళ్లారు. హెల్పింగ్ హ్యాండ్స్ అధ్యక్షుడు టి.మల్లేష్, సభ్యులు పి.చిట్టియ్య, పి.లక్ష్మణరావు, కె.హరిదేవ్, లక్ష్మయ్య, జి.శ్రీనివాస్, శ్రీను రూ.26 వేలు నగదును అందజేశారు.

పెద్దచెరువు ప్రాంతం సుందరీకరణ



యంత్రాలతో శుభ్రం చేసి పెద్దచెరువు ప్రాంతంలో ఏర్పాటు చేసిన బెంచీలు

నర్సీపట్నం : నర్సీపట్నం పెద్దచెరువు ప్రాంత సుందరీకరణకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. శనివారం ఆర్డీవో వి.వి.రమణ, మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర ప్రాంతాన్ని సందర్శించారు. అపరిశుభ్రంగా ఉన్న పెద్ద చెరువు ప్రాంతాన్ని అధికారులు దగ్గర ఉండి శానిటేషన్ సిబ్బందితో శుభ్రం చేయించారు. చెరువు వద్ద సందర్శకులు కూర్చునేందుకు బెంచీలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆదేశాల మేరకు పెద్దచెరువు ప్రాంతాన్ని బ్యూటిఫికేషన్ చేస్తున్నామన్నారు. ఇక్కడ వివిధ రకాల మొక్కలు వేస్తామన్నారు. లైటింగ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు.